క్లుప్తంగా

దేవర నిర్వహణకు విరాళం



విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

చిప్పగిరి: హొళగుంద మండలం నెరణికి గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ నెరణికి లింగేశ్వర స్వామి దేవర నిర్వహణకు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి శనివారం చిప్పగిరిలోని తన నివాసంలో రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, దేవర నిర్వాహకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన వృద్ధులు

వెల్దుర్తి: పట్టణ పరిధిలోని హైవే 44పై చెరుకులపాడు క్రాస్‌లో శనివారం ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. కృష్ణగిరి మండలం ఎస్‌హెచ్ ఎర్రగుడికి చెందిన దస్తగిరమ్మ, హుసేనమ్మ కృష్ణగిరి మీదుగా ఆటోలో తుగ్గలికి వెల్దుర్తి మీదుగా బయలుదేరారు. ఆటో హైవే పైకి చేరుకునే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న దస్తగిరమ్మ, హుసేనమ్మ తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్‌తో సహా మరికొందరు క్షేమంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

సారా నిర్మూలనకు అందరి సహకారం అవసరం



జొన్నగిరిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ సాయి ప్రవీణ్

తుగ్గలి : సారాను అరికట్టడానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐవిశ్వేశ్వరరావు, ఎస్ఐ సాయి ప్రవీణ్ అన్నారు. సారా రహిత రాష్ట్రం కోసం నవోదయం 2.0లో భాగంగా శనివారం పగిడిరాయి, జొన్నగిరిలో అవగాహన సదస్సులు నిర్వహించారు. సారా తయారు చేసినా, అమ్మకాలు జరిపినా పీడీ యాక్ట్ తప్పవని తయారీదారులను హెచ్చరించారు. నాటు సారా వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. సారా తయారీ, విక్రయాల గురించి సమాచారాన్ని 14405 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

నేడు నెణికిలింగేశ్వర పట్టా దేవర



నెరణికిలో శనివారం గంగపూజకు వెళ్తున్న నెరణికి లింగేశ్వర, బీరలింగేశ్వర ఉత్సవ విగ్రహాలు

హొళగుంద: మండలంలోని నెరణికి గ్రామంలో వెలిసిన నెణికి లింగేశ్వరస్వామి పట్టా దేవర మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. కార్యక్రమానికి నెణికి లింగేశ్వర స్వామితో కలిపి మరో 10 గ్రామాల నుంచి వచ్చిన ఉత్సవ విగ్రహాలను గ్రామంలో పూజలు, ఊరేగింపు కుంభోత్సవాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అలాగే అనేక జంటలకు సామూహిక వివాహాలు జరుగుతాయని చెప్పారు.

ఆలయానికి నూతన తేరు



తుగ్గలి : స్థానిక రామాలయానికి శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేంద్ర తేరు చేయించారు. ఏటా శ్రీరామనవమికి స్వామి తిరునాల వైభవంగా జరుగుతుంది. దీంతో రూ.12లక్షలు ఖర్చు చేసి నూతన తేరు చేయించారు. నూతన తేరును శనివారం ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా నాగేంద్ర, వరలక్ష్మి దంపతులు తేరుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉరుకుందలో రుద్ర హోమం

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం వద్ద శనివారం రుద్ర హోమం చేపట్టారు. అరుద్ర నక్షత్రంలో రుద్రహోమం నిర్వహించడం వల్లే శుభాలు జరుగుతాయన్నారు. హోమంలో పాల్గొనే జంటలకు దేవాలయం వారు రూ.1500 రుసుం నిర్ణయించడంతో చాలామంది భక్తులు హోమంలో పాల్గొంటున్నారన్నారు. నవగ్రహ మండపారాధన, రుద్ర కలశ ఆవాహన, రుద్రహోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమాలను శాస్త్రోపేతంగా చేపట్టారు.

అన్ని రంగాల్లోనూ మహిళల సత్తా

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న పలువురు మహిళా ఉద్యోగులను స్వచ్ఛంద సంస్థలు, విద్యాలయాలు, ఆసుపత్రుల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి సన్మానించారు. అలాగే వారి మహిళల శక్తి, యుక్తులను వివరిస్తూ వారి సేవలను కొనియాడారు. పలుగ్రామాల్లో ర్యాలీ నిర్వహించి వారి ప్రాముఖ్యతను వివరించారు.కుటుంబ అభివృద్ధికి, సమాజ అభ్యున్నతిలో మహిళల పాత్రను పలువురు వక్తలు వివిధ కార్యక్రమాల్లో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. – సాక్షి నెట్ వర్క్





మద్దికెరలో మాట్లాడుతున్న పత్తికొండ సీఐ పులిశేఖర్, చిప్పగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచి,పొదుపు మహిళలు





జొన్నగిరిలో మాట్లాడుతున్న ఆర్డీటీ ఎకాలజీ డైరెక్టర్ మురళి, వెల్దుర్తిలో మాట్లాడుతున్న శాంతి

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- పలువురు మహిళలకు సన్మానం

మద్దికెర : నేటి మహిళలు ఉన్నత విద్యనభ్యసించి ఉన్నతంగా ఎదగుతున్నారని అలాగే అన్ని రంగాల్లో రాణించి సత్తా చాటుతున్నారని పత్తికొండ సీఐ పులి శేఖర్ అన్నారు. శనివారం స్థానిక శ్రీవిద్యాసాయి కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్ఐ విజయ్ కుమార్ నాయక్, ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, సర్పంచ్ సుహాసిని, కళాశాల కరస్పాండెంట్ వెంకటమాధవ్, ప్రిన్సిపాల్ బాలసునీత పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని శ్రీషిరిడీ సాయి బాబా దేవాలయం ఆవరణలో శనివారం కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కె.రామ్మోహన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మాజీ మండలాధ్యక్షురాలు ఎస్. నాగరత్నమ్మ, పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచు కొమ్ముదీపిక, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కల్పన, దూదేకొండ పంచాయతీ కార్యదర్శి సాలెహా బొఖారియా, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు మమత తదితరులను సత్కరించారు.





హొళగుందలో మాట్లాడుతున్న పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్‌గౌడ్, పత్తికొండలో మహిళలకు సన్మానం

దేశానికే ఆదర్శంగా నిలవాలి..



కప్పట్రాళ్ల మహిళలతో వర్చువల్‌గా మాట్లాడుతున్న ఐజీ ఆకె రవికృష్ణ

దేవనకొండ: కప్పట్రాళ్ల మహిళలు దేశానికే ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ అన్నారు. మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలోని తానా స్త్రీ శక్తి భవనంలో సే ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఐజీ ఆకె రవికృష్ణ గ్రామాన్ని దత్తత తీసుకుని పదేళ్లు పూర్తయింది. మొదట్లో ఒకటి, రెండు ఉన్న పొదుపు సంఘాలు నేడు వందకు చేరుకోగా.. వెయ్యి మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా ఐజీ వర్చువల్‌గా మహిళలతో మాట్లాడారు. ఆయన సతీమణి ఆకే పార్వతిదేవి మాట్లాడుతూ మహిళలు స్వయంశక్తితో ఎదిగి వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలన్నారు. అనంతరం ఏపీజీబీ బ్యాంకు ద్వారా రూ.50 లక్షలు, గ్రామజ్యోతి మహిళా నిధి ద్వారా రూ.5 లక్షల రుణాలు 10 సంఘాలకు మంజూరు చేశారు. ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ బాలాజీనాయక్, సే ట్రీస్ ప్రోగ్రామ్ మేనేజర్ బి.నారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో పకడ్బందీగా స్వామిత్వ సర్వే



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వీరభద్రప్ప

పత్తికొండ రూరల్ : గ్రామాల్లో పకడ్బందీగా స్వామిత్వ సర్వే చేపట్టాలని డీఎల్‌పీఓ వీరభద్రప్ప, ఈఓఆర్డీ నరసింహులు అన్నారు. శనివారం పత్తికొండలోని టీటీడీ కల్యాణమండపంలో 9మండలాల ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్‌లకు డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న అన్నిరకాల భూములు స్వామిత్వ (రీసర్వే) పకడ్బందీగా చేయాలన్నారు. పత్తికొండ మండలంలో పుచ్చకాయలమాడ, పెద్దహుల్తి గ్రామాల్లో ప్రారంభమైందన్నారు. జూటూరులో ప్రారంభమవుతుందని చెప్పారు. పంచాయతీ సెక్రెటరీ, సర్వేయర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వీఆర్ఓల సమక్షంలో జరిగే సర్వేలో ఆక్రమణలు ఉంటే గుర్తించి వాటిని తొలగించబడుతాయన్నారు. సొంత భూములు, ఇళ్లు పూర్తి కొలతలతో ఆన్‌లైన్‌లో నమోదు చేయబడతాయని చెప్పారు.

లోక్‌అదాలత్‌లో 427 కేసుల పరిష్కారం



కేసులు విచారిస్తున్న జడ్జి రాహుల్ అంబేడ్కర్

పత్తికొండ రూరల్ : పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 427 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో జరిగిన లోక్‌అదాలత్‌లో సివిల్-4, క్రిమినల్-15, ఎక్సైజ్ -30, సిటిసి-269, ఇతర సాధారణ కేసులు 109 పరిష్కరించారు. ఈ కేసుల్లో పలువురికి జరిమానాలు విధించారు. కక్షిదారులు రాజీమార్గంలో కేసులు త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, సీనియర్ న్యాయవాదులు ఆవుల మైరాముడు, నరసింహయ్యాచారి, బత్తిని అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

8 వారాలుగా అందని ఉపాధి వేతనం



హొళగుంద వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

హొళగుంద: మండలంలోని ఆయా గ్రామాలలో వారాల తరబడి పనులు చేసినా కూలి అందక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బరువు పనులు చెయలేని చాలా మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఎండాకాలం మొదలవడంతో పొలాల్లో కూడా పనులు తగ్గిపోయాయయి. 8 వారాలుగా డబ్బులు రాకపోవడంతో కుటుంబం గడవడానికి కష్టంగా మారిందని హొళగుందకు చెందిన ఉపాధి కూలీలు మృత్యుంజయ, వరాలు వీరేష్, మల్లికార్జున, లక్ష్మి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలు గడవాలంటే కూలి డబ్బులు చెల్లించాలని కోరారు. ఎంత పని చేసినా గరిష్ట వేతనం లభించడం లేదని వాపోయారు. కూలి సొమ్ము అందకపోవడంతో అప్పులు చేద్దామంటే తమకు ఎవరూ ఇవ్వడం లేదని చెప్పారు. తినడానికి గింజలు లేక పస్తులుంటున్నామని ఇక తమకు వలస పోక తప్పని పరిస్థితులు కల్పిస్తున్నారన్నారు.

గుడిసె దగ్ధం



నిరాశ్రయులుగా మిగిలిన బాధిత కుటుంబం

హొళగుంద: స్థానిక రాళ్లచేను కాలనీలో ఉన్న జొండే శేఖన్న అనే వ్యక్తికి చెందిన పూరి గుడిసె శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు కాలిపోయింది. భార్య పిల్లలతో పొలం పనికి వెళ్లి ఇంటికి చేరుకుంటుండగా గుడిసె కాలిపోతుండటాన్ని గమనించి స్థానికుల సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో బియ్యం బస్తాలు, బట్టలు, ఇంటి సామగ్రి, ఇతర నిత్యవసర వస్తువులన్నీ కాలిపోయి కుటుంబం కట్టుబట్టలతో నిరాశ్రయులుగా మిగిలారు. దాదాపు రూ.50 వేలుకు పైగ ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

రేపటి నుంచి సుంకులమ్మ జాతర

కృష్ణగిరి: మండలంలోని జి. మల్లాపురం గ్రామంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు మూడు రోజులపాటు సుంకులమ్మ జాతర నిర్వహిస్తామని గ్రామస్తులు శనివారం తెలిపారు. 10న అమ్మవారికి ప్రతి ఇంటి నుంచి నైవేద్యం సమర్పణ, పూజలు ఉంటాయన్నారు. 11న అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారని చెప్పారు. అలాగే.. 12న రాములమ్మ అమ్మవారికి బోనాలు సమర్పిస్తామన్నారు.

టి. గోకులపాడులో దేవర..

టి.గోకులపాడు గ్రామంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు గ్రామ దేవతలైన పెద్దమ్మ, చిన్నమ్మ, కర్రెమ్మ అమ్మవార్ల దేవరను జరుపుకోనున్నట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. 10న గణపతి పూజ, మొలకల పూజ నిర్వహించి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. 11న అమ్మవార్లను ప్రత్యేకంగా ఆలంకరించి ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో పూజిస్తామని చెప్పారు. 12న అమ్మవార్లకు బోనాల సమర్పణ ఉంటుందని వివరించారు.



హొళగుంద బస్టాండ్‌లో వాహనాలు నిలిపిన దృశ్యం

పార్కింగ్ ప్లేస్ కాదు.. బస్టాండే!

హొళగుంద: స్థానిక బస్టాండ్‌లో వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో మోటర్‌సైకిళ్లు ఇతర వాహనాలు నిలబెట్టేందుకు స్థలం లేకపోవడం, దుకాణాల ముందు ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, మోటార్ సైకిళ్ల రద్దీ పెరగడంతో బస్టాండ్‌ను దాటి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నేడు రథోత్సవం

ఆలూరు: మండలంలోని కమ్మరచేడు, కరిడిగుడ్డం గ్రామాల్లో అవధూత శ్రీ మంగమాంబ రథోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు,అర్చకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం గణపతి హోమం, ఫల,పుష్ప పంచామృతాభిషేకం ,మహా మంగళహారతి తదితర రకాల ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం గంగపూజ, ఆకు, ఫల,పుష్ప పూజలు అనంతరం సాయింత్రం రెండు గ్రామాల్లో శ్రీ మంగమాంబ అవ్వల రథాన్ని లాగుతారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

ఆస్పరి: మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో శనివారం వాల్మీకి మహర్షి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభమయ్యాయి. పురోహితులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో గంగ, గోపూజ, మంటప ప్రవేశ, ధ్వజారోహణ, జలాదివాసం, మంగళహారతులు తదితర పూజలు నిర్వహించారు. ఆదివారం ప్రత్యేక పూజలు, సోమవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం చన్న వీర శివాచార్య మహాస్వాములతో నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

అగ్రహార ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

హొళగుంద: మండల కేంద్రం శివారులోని తెల్లకొండ వద్ద వెలిసిన అగ్రహార ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారం కావడంతో మొక్కుబడులున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలను చేయించారు. పూజారి ఆలయ ప్రదక్షిణ, అభిషేకాలు, మహామంగళ హారతి, అలంకారం, ఆకు పూజ, అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆన్‌లైన్‌లో 'పది' హాల్‌టికెట్లు

హాలహర్వి: మండలంలోని పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయని, విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎంఈఓ ఈరన్న తెలిపారు. మీ సేవా లేదా నెట్ సెంటర్‌లకు వెళ్లి ఏపీ ఎస్ఎస్‌సీ-2025 హాల్ టికెట్స్ డౌన్‌లోడ్‌కి వెళ్లి విద్యార్థుల పూర్తి పేరు, చదివిన పాఠశాల, డేట్ ఆఫ్ బర్త్ ఎంటర్ చేస్తే హాల్ టికెట్ డౌన్‌లోడ్ అవుతుందని చెప్పారు.

గూళ్యం జాతరలో విద్యుత్ సిబ్బంది చేతివాటం!

- ప్రతి అంగడికి కరెంటు సరఫరా కోసం రూ.500 ఇవ్వాల్సిందే
- తాత్కాలిక బిల్లు ఇవ్వకుండా వసూలు



గూళ్యం జాతరలో షాపులు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు

ఆలూరు రూరల్: హాలహర్వి మండలం గూళ్యం గ్రామ గాదిలింగేశ్వర స్వామి జాతరలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. ఈ నెల 5న గాదిలింగప్ప తాత రథత్సవం అనంతరం ఆలయ ఆవరణలో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు మిఠాయి అంగళ్లు, గాజుల షాపులు, ప్లాస్టిక్ బొమ్మల షాపులతో పాటు జాతర సందర్భంగా రంగురాట్నం వంటివి ఏర్పాటు చేసుకున్నారు. ఇందు కోసం ఆయా షాపుల నిర్వాహకులు తాత్కాలిక విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు కొనసాగించుకుంటారు. ఆయా షాపుల యజమానులు మూడు లేదా నాలుగు రోజుల పాటు వినియోగించిన విద్యుత్ కోసం ఆ శాఖ అధికారులు అందించే తాత్కాలిక డిమాండ్‌కు అనుగుణంగా బిల్లు చెల్లించాలి. అయితే గూళ్యం జాతర సందర్భంగా గ్రామంలోని తేరు బజారులో 200 పైగా షాపులు ఏర్పాటు చేశారు. శనివారం రోజు విద్యుత్ శాఖ అధికారులు ప్రతి అంగడికి రూ. 500 చొప్పున వసూలు చేసినట్లు కొందరు వ్యాపారులు వాపోయారు. ఇందుకు సంబంధించి తాత్కాలిక బిల్లు కూడా ఇవ్వలేదని ప్రతి ఏడాది ఇదే తంతుతో ఇబ్బంది పడుతున్నామని గోడువెల్లబుచ్చారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తెలిసింది.

నా దృష్టికి రాలేదు



గూళ్యం జాతరలో షాపులు ఏర్పాటు చేసుకున్న వ్యాపారుల నుంచి అనధికారికంగా నగదు వసూలు చేసినట్లు నా దృష్టికి రాలేదు. షాపుల యజమానుల నుంచి వసూలు చేసినట్లు తెలిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

– సంతోష్,ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్, డీఈఈ, ఆలూరు



హోమంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో వెలసిన నారాయణ తాత స్వామి 36వ ఆరాధనోత్సవ పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆలయంలో తాతకు గంగ, ఆకు పూజ, హోమం, నూతన ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఆదివారం ఆలయం ముందు ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన, మంగహారతులు, బలిహరణం, పూర్ణాహుతి, సాయంత్రం ప్రభోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పలికే దేవుడు శ్రీరంగనాథుడు

- కొలిచే వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న స్వామి వారు
- 11 నుంచి 20వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు
- 17న కల్యాణోత్సవం, మహారథోత్సవం



దేవాలయ రాజగోపురం



రంగనాథుడి దేవాలయం (ఏరియల్ వ్యూ),(ఇన్‌సెట్) శ్రీరంగనాథుడి మూల విరాట్, ఉత్సవమూర్తులు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథుడు భక్తవత్సలుడిగా పేరుగాంచాడు. పిలిస్తే పలికే దేవుడిగా.. మొరవిని కోరికలు తీర్చే స్వామిగా కీర్తిగాంచారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు పదిరోజుల పాటు నిర్వహించనున్నారు. వైభవోపేతంగా జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ రెబ్బా వీరయ్య తెలిపారు.

ఆలయ చరిత్ర..

స్వతహాగా వైకుంఠ ద్వారం కలిగిన ఈ ఆలయంలో రంగనాథస్వామి, శ్రీదేవి, భూదేవి సమేతుడై పూజలందుకుంటూ నిత్యం ఉత్తరద్వార దర్శనమిస్తున్నాడు. స్వామివారు ద్వాదశ ఆళ్వారులతో వెలిసిన వైష్ణవ క్షేత్రం. ఎందరో రుషులు తపమాచరించి వారిని దర్శించుటకు శ్రీమన్నారాయణుడే కపిల మహర్షి అవతారమెత్తి ఇచ్చటికి వచ్చి శ్రీరంగనాథ స్వామి సాలగ్రామం ప్రతిష్ఠించినట్లు పురాణ గాథ.



ద్వాదశ ఆళ్వారులు

తదుపరి విజయనగరరాజులైన హరిహర రాయలు, బుక్కరాయలు క్రీ.శ.1336లో దేవాలయం నిర్మించి, ఆలయ నిర్వహణకు వెయ్యి ఎకరాల మాన్యం ఏర్పాటు చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి.

బ్రహ్మోత్సవాలు ఇలా..

11న ధ్వజారోహణం, 12న సింహోత్సవం 13న శేషోత్సవం,14న లంకోత్సవం,15న గరుడోత్సవం,16న గజోత్సవం, 17న సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి చిత్తానక్షత్రములో స్వామి వారి కల్యాణోత్సవం, కల్యాణానికి నూతన వస్త్రములు కల్యాణ మంటపానికి, రథం, పాన్పు సేవకు పుష్పాలంకరణను గ్రామానికి చెందిన పారా రామన్న గారి కుమారులు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ చేయిస్తారు. అదే రోజు ఉదయం 10 గంటలకు రథాంగ హోమం, 11:55 గంటలకు బ్రహ్మరథం, సాయంత్రం అశేష జనవాహిని మధ్య 'మహా రథోత్సవం' జరిపించనున్నారు.

- 18న అశ్వవాహనం..
- 19న ఉదయం పూర్ణహుతి, వసంతోత్సవం, రాత్రి హంస వాహన సేవ
- 20న ద్వాదశ ప్రదక్షిణోత్సవములు, రాత్రి పవళింపు సేవ

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

శ్రీరంగనాథస్వామి వారిని తమ ఇలవేల్పుగా కొలుచుకుంటూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. దేవాలయ ఆవరణలో అన్నదానం కూడా ఏర్పాటుచేశాం. తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రసాదాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం.

– రెబ్బా వీరయ్య ఆలయ కార్యనిర్వహణాధికారి.